క్లుప్తంగా

ఉత్సవాల కరపత్రాలు ఆవిష్కరణ



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న సభ్యులు

శ్రీరంగరాజపురం: మండలంలోని ప్రముఖ దేవస్థానమైన తయ్యూరు పాయకట్టులో శ్రీ ఆరిమాని గంగమ్మ దేవస్థానం బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని ఆదివారం ఉత్సవాల కరపత్రాలను చైర్మన్ వై. లింగారెడ్డి ఆవిష్కరించారు. ఏయే రోజుల్లో ఏయే కార్యక్రమాలు నిర్వహిస్తారో కరపత్రాలతో తెలియజేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు రమణ ప్రసాద్‌రెడ్డి, ఎంపీపీ జనార్ధన్, పాలక మండలి సభ్యులు మునికృష్ణ, సర్పంచులు చంద్రారెడ్డి, గండు మణి, పాయకట్టు నేతలు మునికృష్ణ, డిసెంబర్ శెట్టి, రామనాథ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన



వైద్యశిబిరానికి హాజరైన జనం

నగరి: పీసీఎన్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో రాజలక్ష్మి మెడికల్ కళాశాల, హాస్పిటల్ వారు, పాఠశాల పూర్వ విద్యార్థుల సంఘం వారు సంయుక్తంగా ఆదివారం నిర్వహించిన మెగా వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. రక్తపోటు, షుగర్ వ్యాధి పరిశోధన, చర్మ సంబంధిత వ్యాధులు, ఎముకల సంబంధిత వ్యాధులు, మహిళలకు చికిత్స, కంటి చికిత్స, చెవి, ముక్కు, గొంతు సంబంధిత చికిత్సలు ఈ శిబిరంలో అందించారు. సుమారు 500 మంది పాల్గొని ఉచిత చికిత్స అందుకున్నారు. ఈ శిబిరాన్ని ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు.

హుండీ ఆదాయం రూ.1.55లక్షలు



హుండీ ఆదాయం లెక్కిస్తున్న కమిటీ సభ్యులు

కార్వేటినగరం: కార్వేటినగరం గ్రామదేవత శ్రీబంగారమ్మ ఆలయం హుండీ ఆదాయం 1,55,890 రూపాయలు లభించిందని ఆలయ అధ్యక్షుడు ప్రసాద్ తెలిపారు. ఆదివారం ఆలయ ఆవరణలో హుండీ ఆదాయం లెక్కించారు. వచ్చిన ఆదాయాన్ని ఆలయాభివృద్ధికి వినియోగిస్తామని ఆయన చెప్పారు. ఆలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

బదిలీ పోలీసులకు వీడ్కోలు సన్మానం



ఏఎస్ఐ, కానిస్టేబుళ్లకు సన్మానం చేస్తున్న ఎస్ఐ భారతి

పాలసముద్రం: మండలబ కేంద్రంలోని పోలీ స్టేషన్ నుంచి బదిలీ అయిన ఏఎస్ఐ, కానిస్టేబుళ్లకు ఆదివారం వీడ్కోలు సన్మానం చేశారు. ఏఎస్ఐ చక్రవర్తి పెనుమూరు మండలానికి, మురుగేష్ చిత్తూరుకు, కానిస్టేబుల్ రమేష్, మహేష్, ఢిల్లీ తదితరులు బదిలీపై వెళ్లారు. ఈ నేపథ్యంలో వారిని ఎస్ఐ భారతి తమ సిబ్బందితో కలిసి సన్మానించారు. వారి సేవలను ప్రస్తుతించారు. ఎక్కడ పనిచేసినా అంకితభావంతో విధులు నిర్వర్తిస్తూ మన్ననలు పొందాలని ఆకాంక్షించారు.

దోమలు నివారించండి



మాట్లాడుతున్న నాగరాజన్

చిత్తూరు కార్పొరేషన్: నగరంలో దోమల విపరీతంగా వ్యాప్తి చెందుతున్నాయని, దీంతో ప్రజలు రోగాల బారిన పడుతున్నారని, దోమల నివారణకు కార్పొరేషన్ అధికారులు వెంటనే చర్యలు చేపట్టాలని సీపీఐ జిల్లా కార్యదర్శి నాగరాజన్ డిమాండ్ చేశారు. ఆదివారం చిత్తూరులో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వర్షాల కారణంగా చిత్తూరులో పారిశుద్ధ్య నిర్వహణ అధ్వానంగా మారిందన్నారు. ముఖ్యంగా మంగసంద్రం హౌసింగ్ కాలనీ, పెద్ద దళితవాడ, ఇరువారం, జానకారపల్లె ,అంబేద్కర్ నగర్, కట్టమంచి, తేనెబండ దళితవాడ, తోటపాళ్యం, వెంగళరావు కాలనీ, స్కావెంజర్స్ కాలనీ, శ్రీనివాసనగర్ ,కుమార్ నగర్ కాలనీ, తంగవేలు కాలనీ ,ఇందిరమ్మ కాలనీ, చవటపల్లె, ఇందిరమ్మ నగర్ , వన్నియర్ బ్లాక్ ప్రాంతాల్లో పరిస్థితి మరింత దారుణంగా తయారైందని వివరించారు. మురుగు నిల్వ చేరడంతో దోమలు వ్యాప్తి చెందుతున్నాయని వెల్లడించారు. సమావేశంలో మణి, శ్రీనివాసులు, రమాదేవి, లతారెడ్డి, గిరిజ, చాంద్ భాషా, పద్మ, సుశీలమ్మ పాల్గొన్నారు.

వంటికి నడక మంచిదేగా..!



వాకింగ్ చేస్తున్న యువత



పుత్తూరు ఎస్ఆర్ఎస్ కళాశాల గ్రౌండ్‌లో వాకర్స్

నేటి పోటీ ప్రపంచంలో ప్రజలు యాంత్రిక జీవనానికి అలవాటు పడ్డారు. శారీరక శ్రమ చేయడమే మరిచిపోతున్నారు. ఇందుకు తగ్గట్టు ఆహార అలవాట్లలోనూ మార్పులు చోటు చేసుకుంటున్నాయి. దీంతో చిన్న వయస్సులోనే బీపీ, షుగర్ తదితర దీర్ఘకాలిక వ్యాధుల బారిన పడుతున్నారు. ఈ జాడ్యాలను వదిలించుకోవడానికి నడక ఒక్కటే మార్గమని డాక్టర్లు సూచిస్తున్నారు. ఫలితంగా ఉదయం, సాయంత్రం వేళల్లో వాకింగ్ చేస్తున్న వారి సంఖ్య గణనీయంగా పెరుగుతోంది. వాకర్స్ అసోసియేషన్లు సైతం వెలుస్తున్నాయి. 22 ఏళ్ల క్రితమే పుత్తూరు వాకర్స్ అసోసియేషన్‌ను ఏర్పాటు చేసిన 83 ఏళ్ల డాక్టర్ కె.శ్రీనివాసులురెడ్డి నేటికీ నడుస్తూ, అందరినీ ముందుండి నడిపిస్తున్నారు.

- రోజూ గంట నడకతో ఆరోగ్యం పదిలం
- నియంత్రణలో దీర్ఘకాలిక రోగాలు
- వాకర్స్ అసోసియేషన్ల స్థాపన



పుత్తూరు వాకర్స్ అసోసియేషన్ భవనం

పుత్తూరు: ఆరోగ్యమే మహాభాగ్యం అన్న పెద్దల మాట నేడు ప్రతి ఒక్కరినీ నడిపిస్తుందనడంలో అతిశయోక్తి లేదు. తెల్లవారు జామున సూర్య కిరణాలు శరీరానికి విటమిన్-డి అందేలా చూస్తాయి. డి-విటమిన్ బరువు తగ్గేందుకు సహకరిస్తుంది. దీంతోపాటు గుండెకూ మేలు చేస్తోంది. ఉదయాన్నే నిద్రలేవడంతో జీవక్రియల ప్రక్రియ సక్రమంగా ఉంటుంది. నీళ్లు ఎక్కువ తాగడంతో శరీరంలో కొవ్వు కేలరీలు అధిక శాతం కరుగుతాయి. బీపీ నియంత్రణలో ఉంటుంది. షుగర్ వ్యాధి ఉన్న వారికి నడక ఎంతగానో ఉపయోగపడుతుంది. మానసిక స్థితి మెరుగుపడుతుంది.

జాగింగ్ ఇలా చేయాలి

చిన్నపాటి పరుగుతో ఆరోగ్యం, శరీరాకృతిలోనూ మార్పులు వస్తాయి. తొడలు, పిరుదులు, పొట్ట చుట్టూ ఉండే కొవ్వు పదార్థాలు కరిగిపోతాయి. వలయాకారంలో ఉండే ట్రాక్‌పై 40 నిమిషాల్లో 4 కిలోమీటర్లు పరిగెత్తాలని నిపుణులు చెబుతున్నారు. ఇలా పరిగెత్తేటప్పుడు మొదట వార్మప్ కోసం నాలుగు రౌండ్లు (రౌండ్ 400 మీటర్లు) మామూలుగా నడవాలి. ఒక రౌండు వేగవంతమైన నడక, తర్వాత రెండు రౌండ్లు నడకలాంటి పరుగు చేయాలి. తర్వాత ఒక రౌండు వేగం పెంచి నడిచి, చివరగా రెండు రౌండ్లు సాధారణమైన నడకతో వ్యాయామం ముగించాలి. ఇలా మొత్తం 10 రౌండ్లను పూర్తి చేయడానికి 40 నిమిషాలు సరిపోతాయి.

పిల్లలను భాగస్వామ్యం చేయండి

జీవన విధానంలో వచ్చిన మార్పుల కారణంగా ఎక్కువ మంది ఊబకాయంతో బాధ పడుతున్నారు. ఫాస్ట్‌ఫుడ్స్, కేక్‌లు, పిజ్జాలు, బర్గర్లు, చాట్స్ వంటి జంక్ ఫుడ్స్‌ను తీసుకోవడం ద్వారా చిన్నారులు, యువత చిన్న వయసులోనే వ్యాధుల బారిన పడుతున్నారు. ఇలాంటి వారిని ప్రతిరోజూ నడిపించడం, ఆడించడం ద్వారా బీపీ, షుగర్‌లను అదుపులో ఉంచడంతోపాటు మానసిక ఒత్తిడిని దూరం చేయవచ్చు. శారీరక శ్రమతో చిన్నారుల్లో ఎదుగుదల, ఆలోచనా శక్తి పెరుగుతుంది.

ఆదర్శంగా అసోసియేషన్లు

ఆరోగ్యంపై పెరిగిన శ్రద్ధ దృష్ట్యా నడుస్తూ, నలుగురిని కలుస్తూ, మరికొందరిని నడిపించడానికి పలు వాకర్స్ అసోసియేషన్లు వెలుస్తున్నాయి. 22 ఏళ్ల క్రితమే పుత్తూరు వాకర్స్ అసోసియేషన్ ఏర్పడింది. ఫౌండర్ ప్రెసిడెంట్ డాక్టర్ కె.శ్రీనివాసులురెడ్డి ఆధ్వర్యంలో అసోసియేషన్ పలు సేవా కార్యక్రమాలను నిర్వహిస్తోంది. నెలనెలా సమావేశాలు నిర్వహిస్తోంది. పలు రంగాల్లో విశిష్ట వ్యక్తులను పిలిపించి వారి ద్వారా అవగాహన కల్పిస్తూ, ప్రజలను చైతన్యవంతులను చేస్తున్నారు. 200 మందికి పైగా సభ్యులు కలిగిన పుత్తూరు అసోసియేషన్ సొంత భవనాన్ని సైతం ఏర్పాటు చేసుకోగలిగింది. సంఘ సభ్యుడైన పట్టణానికి చెందిన డి.ఎస్.సుబ్రమణ్యం(చిన్నా) స్థలాన్ని విరాళంగా అందజేశారు. కైలాసపురానికి చెందిన వసంత తరుణ్‌కుమార్ భవన నిర్మాణానికి భూరివిరాళాన్ని అందజేశారు.

గుండె జబ్బులు రావు



క్రమం తప్పకుండా నడవడంతో శరీర బరువుతోపాటు కొలెస్ట్రాల్, బీపీ, షుగర్ నియంత్రణలో ఉంటాయి. ఫలితంగా గుండె జబ్బులు, గుండెపోటుకు గురయ్యే అవకాశం తక్కువగా ఉంటుంది. ప్రతి ఒక్కరూ ప్రతిరోజూ ఉదయం అరగంట నుంచి గంట పాటు వాకింగ్ చేయడం ఎంతో ఉత్తమమైన వ్యాయామం.

– డాక్టర్. కె.శ్రీనివాసులురెడ్డి, రిటైర్డ్ డిప్యూటీ సివిల్ సర్జన్, వ్యవస్థాపక అధ్యక్షుడు, పుత్తూరు వాకర్స్ అసోసియేషన్

శిథిలావస్థకు చేరిన భవనాన్ని తొలగించరూ!



శిథిలావస్థకు చేరిన కాలేపల్లె ఆరోగ్య ఉప కేంద్రం భవనం

గంగాధరనెల్లూరు: మండలంలోని కాలేపల్లె హైస్కూల్ స్థలంలో ఉన్న ఆరోగ్య ఉప కేంద్ర భవనం శిథిలావస్థకు చేరుకుని విషసర్పాలకు నిలయంగా మారిందని, దీనిని తొలగించాలని పలువురు కోరుతున్నారు. వరత్తూరు పంచాయతీ కాలేపల్లెలో సుమారు 35 ఏళ్ల క్రితం ఆరోగ్య ఉప కేంద్రం భవనాన్ని నిర్మించారు. గ్రామస్తులకు ఎన్నో సేవలు అందించిన ఈ కేంద్రం ఆలనా పాలన పట్టించుకోకపోవడంతో శిథిలావస్థకు చేరింది. మోల్డింగ్ సిమెంట్ పెచ్చులూడుతుండడంతో వర్షాకాలంలో ఉరుస్తోంది. మరోవైపు ఈ భవనానికి సమీపంలోని నివాస్తులు చెత్తాచెదారం తెచ్చి దీనినిలో పడేస్తూ దీనిని డంపింగ్‌యార్డును తలపించేలా చేశారు. భవనం పక్కనే ఉన్న పాఠశాల విద్యార్థులు దుర్వాసన భరించలేకపోతున్నారు. అంతేకాకుండా పిచ్చి మొక్కలు పెరిగిపోయి పాములకు ఆవాసమైంది. అధికారులు ఇకనైనా నిరుపయోగంగా ఉన్న ఈ భవనాన్ని తొలగించేందుకు పూనుకోవాలని కోరుతున్నారు.

పూర్తికావచ్చిన వినాయక ఆలయ నిర్మాణం



వినాయక ఆలయం

వెదురుకుప్పం: మండలంలోని సీఆర్‌కండ్రిగ ఎస్సీ కాలనీలో నిర్మిస్తున్న వినాయక ఆలయం పనులు పూర్తి కావచ్చాయి. గ్రామంలో ఆలయం నిర్మించాలని అప్పటి ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామిని గ్రామస్తులు కోరడంతో స్పందించిన ఆయన దేవదాయశాఖ నుంచి రూ.10 లక్షలు మంజూరు చేయించారు. దీంతో స్థానిక సర్పంచ్ శిల్ప అప్పట్లోనే పనులు ప్రారంభించారు. ప్రస్తుతం ఆలయానికి రంగులు, గ్రానైట్ పనులు పూర్తి చేశారు. ఆలయాన్ని నూతన హంగులతో తీర్చిదిద్ది త్వరలో కుంభాభిషేక మహోత్సం నిర్వహించనున్నట్లు శిల్ప తెలిపారు.

దుస్థితిలో పిలసపాళెం రోడ్డు



పిలసపాళెం రోడ్డు దుస్థితిని వివరిస్తున్న గ్రామస్తులు, రైతులు

విజయపురం: పిలసపాళెం రోడ్డు పన్నూరు దళితవాడ ప్రజలకు ఓ శాపంగా మారింది. ఏ లగ్నంలో రోడ్డు పనులు ప్రారంభించారో తెలియదు గానీ ఇప్పటికీ ఆ పనులు ముందుకు కదలలేదు. పన్నూరు రోడ్డు నుంచి పిలసపాలెం రోడ్డుకి 6 కిలోమీటర్లు ఉంది. ఈ మార్గంలో పన్నూరు దళితవాడ ప్రజలకు సంబంధించిన వ్యవసాయ భూములు చాలా ఉన్నాయి. అయితే రోడ్డు మార్గం లేకపోవడంతో స్థానిక ప్రజలు, రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అంతే కాకుండా మూగజీవాలను మేత కోసం అడవి ప్రాంతాలకు తీసుకెళ్లాలంటే ఈ మార్గం ఒక్కటే దిక్కు. 2019లో వైఎస్ఆర్ సీపీ అధికారంలోకి వచ్చాక మంత్రి ఆర్కే రోజా ఢిల్లీ వెళ్లి నాబోర్డు కింద రూ.2 కోట్లు నిధులను మంజూరు చేయించారు. ఓ కాంట్రాక్టర్ పనులు కూడా ప్రారంభించాడు. అయితే ఎన్నికల కోడ్ రావడంతో పనులు ఆగిపోయాయి. ఎన్నికల తరువాత తిరిగి పనులు ప్రారంభించారు. అయితే టీడీపీ అధికారంలోకి రావడంతో గత ప్రభుత్వంలో మంజూరైన పనులన్నీ నిలిపివేయాలని చెప్పడంతో కాంట్రాక్టర్ పనులు ఆపివేసినట్లు తెలిసింది. దీంతో పిలసపాళెం రోడ్డు పనులు అర్ధంతరంగా ఆగిపోయాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అదుపులోకి అతిసారం



మాట్లాడుతున్న వైద్యాధికారులు

తవణంపల్లె: మండలంలోని కొత్త గొల్లపల్లెలో వారం రోజులుగా విజృంభించిన అతిసారం ఆదివారం నాటికి అదుపులోకి వచ్చింది. తాగునీరు కలుషితం కావడంతో పెద్దసంఖ్యలో గ్రామస్తులు అతిసారం బారిన పడ్డారు. దీంతో మండల వైద్యాధికారులు ప్రియాంక, మోహన్‌వేలు, కేశవ నారాయణ ఆధ్వర్యంలో వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. సకాలంలో మెరుగైన వైద్యసేవలు అందించడంతో రోగులు బయటపడ్డారు. ఈ క్రమంలోనే అతిసారం అదుపులోకి రావడంతో గ్రామస్తులు ఊపిరి పీల్చుకున్నారు. ఈ సందర్భంగా వైద్యులు మాట్లాడుతూ వాంతులు, విరేచనాలు తగ్గిన వెంటనే డాక్టర్లను సంప్రదించాలని సూచించారు. తాగునీరు కలుషితం కాకుండా పంచాయతీ అధికారులు తగు చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రస్తుతం గ్రామంలో ప్రజల ఆరోగ్యం నిలకడగా ఉందని, ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని తెలిపారు.

ప్రత్యేక న్యూరో క్యాంపులు



మాట్లాడుతున్న శ్రీకాంత్ శ్రీనివాసన్

చిత్తూరు రూరల్ (కాణిపాకం): అపోలో క్లినిక్‌లో రెండు నెలలకు ఒకసారి చేపట్టే న్యూరోలాజికల్, మానసిక ఆరోగ్య సమస్యల ప్రత్యేక క్యాంపులను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని వైద్యనిపుణుడు శ్రీకాంత్ శ్రీనివాసన్ కోరారు. ఆదివారం చిత్తూరు నగరంలోని అపోలో క్లినిక్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. ఇటీవల కాలంలో నరాల బలహీనత, మానసిక రుగ్మతల సమస్యలు ప్రజలను ఎక్కువగా వేధిస్తున్నాయన్నారు. వీటికి అపోలో క్లినిక్‌లో చికిత్స అందిస్తున్నామని చెప్పారు. చిత్తూరువాసుల కోసం రెండు నెలలకు ఒకసారి ప్రత్యేక క్యాంపులు ఏర్పాటు చేసి వైద్య సేవలను అందిస్తున్నట్లు వివరించారు. కార్యక్రమంలో వైద్యులు రమణరావు, ప్రసన్నకుమార్, పీఆర్ఓ కమురుద్దీన్ పాల్గొన్నారు.

కల్యాణం.. కమనీయం



కళ్యాణోత్సవం ఉభయదారులకు స్వామివారి చిత్రపటం అందజేస్తున్న అర్చకులు

గంగాధరనెల్లూరు: మండలంలో వేపంజేరిలోని శ్రీదేవీ భూదేవీ సమేత లక్ష్మీనారాయణలకు ఆదివారం భక్త జన సందడి నడుమ కల్యాణోత్సవం నిర్వహించారు. ఉదయం స్వామి అమ్మవార్లకు సుప్రభాతం, అభిషేకం నిర్వహించారు. అనంతరం ఉత్సవ మూర్తులను అర్చకులు పట్టువస్త్రాలు, సుగంధ భరిత పుష్పాలతో అలంకరణ చేసి శాస్త్రోక్తంగా కల్యాణోత్సవం నిర్వహించారు. తమిళనాడు రాష్ట్రం చెన్నైకు చెందిన సుందర్ జగదీశ్వరి దంపతులు ఉభయ దారులుగా వ్యవహరించారు. ఆలయ మర్యాదలతో వారిని సత్కరించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. తిరుమల-తిరుపతి దేవస్థానం కళాకారులు రంజితమ్మ హరికథాగానం చేశారు. రెడ్డెమ్మ అన్నమయ్య భక్తి గీతాలు ఆలపించారు. కార్యక్రమంలో ఆలయ మేనేజర్ నల్లా వెంకటేష్ రెడ్డి, ఆలయ అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

3 నుంచి దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు



ఆలయ ముఖచిత్రం

వెదురుకుప్పం: మండలంలో డీఆర్ఎన్‌కండ్రిగ సమీపంలోని అరుణగిరిపై ఉన్న శ్రీజ్ఞాన ప్రసూనాంబ సమేత కొండమల్లీశ్వరస్వామి ఆలయ ఆవరణలోని శ్రీ రాజరాజేశ్వరి దేవి అమ్మవారి ఆలయంలో అక్టోబర్ 3 గురువారం నుంచి 12వ తేదీ శనివారం వరకు దసరా మహోత్సవాలను వైభవంగా నిర్వహించనున్నట్లు నిర్వాహకులు ఆదివారం తెలిపారు. 3న గురువారం బాలత్రిపుర సుందరీ దేవి, శుక్రవారం గాయత్రి దేవి, శనివారం అన్నపూర్ణదేవి, ఆదివారం లలిత త్రిపుర సుందరీ దేవి, సోమవారం మహాచండీదేవి, మంగళవారం మహాలక్ష్మిదేవి, బుధవారం సరస్వతీదేవి, గురువారం దుర్గాదేవి, శుక్రవారం మహిషాసురమర్ధిని, చివరి రోజు శనివారం రాజరాజేశ్వరి దేవి అలంకరణలో అమ్మవారు భక్తులకు దర్శనమిస్తారని తెలియజేశారు. ఉత్సవాలకు సంబంధించి ఏర్పాట్లు చేస్తున్నట్లు చెప్పారు.

దివ్యాంగుల నిరసన



నింద్ర పోలీస్‌స్టేషన్ వద్ద దివ్యాంగుల నిరసన

నింద్ర: నగరి రూరల్ సీఐ భాస్కర్ తీరుపై నిరసనగా ఆదివారం సాయంత్రం నింద్ర పోలీస్‌స్టేషన్ వద్ద రాష్ట్ర దివ్యాంగుల నిరుద్యోగ జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు కె.చంద్రశేఖర్ ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నింద్ర గ్రామానికి చెందిన దివ్యాంగుల నాయకుడు ఉమాపతి, కుటుంబ సభ్యులపై జరిగిన దాడిపై ఈ నెల 21వ తేదీన ఫిర్యాదు చేస్తే ఇప్పటి వరకు కూడా కేసు నమోదు చేయలేదని తెలిపారు. మహిళలు దివ్యాంగుడి ఇంటి పైకి వెళ్లి చంపుతామని బెదిరిస్తున్నారని తెలిపారు. సీఐ న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. రఘు, రమేష్, జయరాంనాయుడు, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత కంటి వైద్య శిబిరానికి స్పందన



కంటి వైద్య పరీక్షలు చేస్తున్న నిపుణులు

కార్వేటినగరం: శ్రీవెంకటేశ్వర అరవింద కంటిఆస్పత్రి (తిరుపతి) సౌజన్యంతో నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన లభించిందని డైట్ అధ్యాపకులు చెంగల్రాజు తెలిపారు. ఆదివారం స్థానిక జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. మండలంలోని వివిధ గ్రామాల నుంచి దాదాపు 500మందికి పైగా వైద్య పరీక్షలకు హాజరయ్యారు. వారిని అరవింద కంటి ఆస్పత్రి వైద్య నిపుణులు పరీక్షించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కంటి ఆపరేషన్లకు 35 మందిని ఎంపిక చేసి తరలించారు. బాలికల ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు వేణుగోపాల్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

అట్టహాసంగా దుర్యోధన వధ

తవణంపల్లె: స్థానిక ద్రౌపదీ సమేత ధర్మరాజస్వామి ఆలయంలో 119వ మహాభారత యజ్ఞంలో భాగంగా ఆదివారం సాయంత్రం దుర్యోధన వధ ఘట్టాన్ని అట్టహాసంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ద్రౌపదీదేవి, పాండవుల విగ్రహాలకు అభిషేకం, పూజలు చేశారు. అనంతరం మట్టితో తయారుచేసిన దుర్యోధనుడి బొమ్మ దగ్గరకి విగ్రహాలను ఊరేగింపుగా తీసుకువచ్చారు. మడుగులో దాగివున్న దుర్యోధనుడిని బయటకు లాక్కొచ్చి వధించే ఘట్టం ప్రేక్షకులను ఆకట్టుకుంది. దుర్యోధన వధ అనంతరం మట్టి కోసం భక్తులు పోటీ పడ్డారు. సోమవారం ధర్మరాజస్వామి పట్టాభిషేకం , అగ్నిగుండ ప్రవేశంతో మహాభారత యజ్ఞం ముగుస్తుందని నిర్వాహకులు తెలిపారు.

పశుబీమాకు ఆదరణ కరువు

పశుపోషణ వ్యవసాయ అనుబంధ రంగం. పల్లెల్లో ఈ రంగంపై ఆధారపడి జీవనం సాగించే కుటుంబాలు చాలానే ఉన్నాయి. పాడి పశువులు ప్రమాదవశాత్తు, వ్యాధులు, వరదలు, ప్రకృతి వైపరీత్యాలు, విష సర్పాల కాటు, అగ్ని ప్రమాదాలు తదితర కారణాలతో మరణిస్తే ఆ పాడి రైతుకు చాలా నష్టం వాటిల్లుతుంది. ఈ నేపథ్యంలో వారిని ఆదుకోవడానికి ప్రభుత్వం పశు బీమా పథకాన్ని అమల్లోకి తెచ్చింది. అయితే పశువులకు బీమా చేయించడానికి రైతులు ముందుకు రాకపోవడంతో ప్రభుత్వ లక్ష్యం నెరవేరడం లేదు. నగరి పశుసంవర్ధక శాఖ సంచాలకుల పరిధిలో 64293 పశువులకు గాను కేవలం 1235 పశువులకు మాత్రమే ఇప్పటి వరకు బీమా చేశారు.

– నగరి

- ఆసక్తి చూపని పాడి రైతులు
- బీమా చేస్తే ప్రయోజనకరం అంటున్న పశువైద్యులు



పశువుకు బీమా చెవిపోగు వేస్తున్న వైద్యులు

కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా పశువుల బీమా అందజేస్తున్నాయి. ఈ బీమా ప్రీమియం మూడేళ్లకు రూ.2 వేలు. ఇందులో కేంద్ర ప్రభుత్వం రూ.800, రాష్ట్ర ప్రభుత్వం రూ.800 చెల్లిస్తాయి. మిగిలిన రూ.400 రైతులు చెల్లించాలి. అదే గొర్రెలు లేదా మేకకు అయితే కేవలం రూ.20 కడితే మిగిలిన రూ.80 కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమానంగా చెల్లిస్తాయి. ఒకటి లేదా రెండు పశువులు ఉన్న రైతులు బీమా కడుతున్నారు. కానీ ఎక్కువ పాడి పశువులు ఉన్న రైతులు ఒక్కసారిగా అంత మొత్తం చెల్లించలేక బీమా కట్టడానికి ముందుకు రావడం లేదు. దీంతో పశువుల బీమాకు ఆదరణ కరువైంది.

పశు జాతిని అనుసరించి బీమా

ఏదైనా ప్రమాదం వలన జంతువు మరణిస్తే దేశవాళీ, సంకర జాతి పశువులకు రూ.30 బీమా, నాటు జాతికి చెందిన పశువులకు దీంతో రూ.15 వేలు, గొర్రె, మేకకు రూ.6 వేలు వరకు బీమా వస్తుంది. అయితే చాలా మంది రైతులు బీమా చెల్లించకపోవడంతో ప్రమాదవశాత్తు పశువు మరణించినా ఒక్క రూపాయి కూడా రావడం లేదు. ఆ సమయాల్లో రైతులు నాయకులతో సిఫారసు చేయించినా, అధికారుల చుట్టూ తిరిగినా ప్రయోజనం ఉండదు. కనుక ప్రతి పశువుకు బీమా చేయించాల్సి ఉంటుంది. ముఖ్యంగా వరద బాధిత గ్రామాల రైతులకు బీమా అవసరం ఎక్కువగా ఉంటుంది. ప్రతి ఏడాది వరదలు వస్తున్న తరుణంలో విషసర్పాలు, వరదల వలన పశువులకు ప్రాణ నష్టం జరిగే అవకాశాలు ఎక్కువ. ఈ నేపథ్యంలో వరద బాధిత గ్రామాల రైతులు తప్పనిసరిగా ప్రతి పశువుకు బీమా చేయడం ఉత్తమం.


మార్గదర్శకాలు

బీమా చేయించేటప్పుడు రైతు ఆధార్ కార్డు, తెల్లరేషన్ కార్డు అందించాలి. పాడి పశువు లకు బీమా చేసే క్రమంలో ట్యాగ్ వేస్తారు. ప్రమాదవశాత్తు పశువు మరణిస్తే వెంటనే సమీపంలోని సిబ్బందికి సమాచారం ఇవ్వా లి. ఒకవేళ బీమా చేయించిన పశువును అమ్మివేస్తే పశువును కొనుగోలు చేసిన వ్యక్తి ఏడు రోజుల్లో బీమా కంపెనీ ప్రతినిధులకు సమాచారం ఇచ్చి తన పేరు మీద బీమా మార్చుకోవాలి.

నగరి పశుసంవర్ధక సంచాలకుల పరిధిలో

మొత్తం	పశువులు	బీమా చేసినవి
ఆవులు	22712	694
గేదెలు	1529	171
మేకలు	23989	247
గొర్రెలు	16063	123
మొత్తం	64293	1235

తప్పకుండా బీమా చేయించాలి



రైతులు కేవలం 20 శాతం బీమా కడితే మిగిలిన 80 శాతం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బీమా చెల్లిస్తాయి. ఈ విధంగా దేశవాళీ, సంకర జాతి పశువులకు రూ.400, నాటు జాతికి చెందిన పశువులకు రూ.200, గొర్రె, మేకకు రూ.20 బీమా చెల్లిస్తే సరిపోతుంది. రైతులంతా తప్పకుండా తమ పశువులకు బీమా చేయించుకోవాలి.

– డాక్టర్ వాసు, ఏడీ, పశుసంవర్ధక శాఖ.